# లక్ష్యం

## 'నవల'



శ్రీమతి కె. వాసవదత్త రమణ

# లక్ష్యం

**"శ్రీమతి కె. వాసవదత్త రమణ"**

"అమ్మా!' కారు వచ్చిందే! అన్నయ్య వచ్చేసాడు!" ఉద్వేగంగా అంది వకుళ అరుగు మీద నుంచి లోపలకి ఇంట్లోకి తొంగి చూస్తూ!

శ్రావ్యంగా వినపడుతున్న చెల్లెలి గొంతు విని కారులోంచి దిగుతున్న రవితేజ కళ్లు చెమర్చాయి!

"ఎన్నాళ్లకి, ఎన్నేళ్లకి!" అతని మనస్సు రెపరెపలాడింది! "ఎక్కడ అమెరికా! ఎక్కడ ఇండియా?" ఆరేళ్ల తర్వాత తను పుట్టి పెరిగిన కోనసీమ గడ్డ మీద కాలు మోపుతుంటే అతని మనస్సులో ఆనందపు కెరటాలు ఉవ్వెత్తున ఎగిసాయి! "అన్నయ్యా!" వకుళ వచ్చి సంతోషంతో అతన్ని రెండు చేతులు పట్టుకొంది. ఆప్యాయంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు!

"నాన్నా, రవితేజ! వచ్చావా?" నీ కోసం ఎదురు చూసి చూసి కళ్లు కాయలు కాచిపోయాయిరా!" లోపల్నుంచి లక్ష్మీదేవి వస్తూనే కొడుకుని రెండు చేతులతో చుట్టేస్తూ భోరుమని ఏడ్చేసింది!

"అమ్మా!" రవితేజ కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి!

ఆవిడని దగ్గరగా తీసుకుని, "ఇక వచ్చేసానుగా, ఏడవకమ్మా!" గద్గదికంగా అన్నాడు!

"లక్ష్మీ! ఏమిటది మరీ చిన్న పిల్లలాగా! ముందు వాడ్ని లోపలికి రానీ"! వెనుకగా వచ్చి భార్యని భుజం మీద తడుతూ అన్నాడు సత్యమూర్తి, కొడుకుని చూడగానే ఎగసి వస్తున్న ఆనందాన్ని కళ్లలోనే ఆనంద భాష్పాలుగా దాచుకుంటూ!

"నాన్నగారు? ఎలా ఉన్నారు"? చటుక్కున వంగి తండ్రి పాదాలకి నమస్కరించాడు రవితేజ.

"రవి!" అంటూ అతన్ని వదల్లేనట్టుగా, ఇన్నేళ్ల బాధను చూపెడుతున్నట్టుగా బలంగా కౌగిలించుకున్నారాయన! తండ్రి స్పర్శ – అతనిలో చిన్నతనపు జ్ఞాపకాలన్నింటిని తట్టి మరీ లేపి అతన్ని వేరే లోకానికి తీసుకెళ్లింది! అలాగే నిలబడి పోయాడు!

"సరి, సరి! నన్నంటూ, మీరేమిటి ఇలా మీ కొడుకుని అస్సలు వదల్లేకపోతున్నారు!" చీర కొంగుతో కళ్లనీళ్లు తుడుచుకుంటూ లక్ష్మీదేవి పరిహాసమాడింది పక్క నుంచి!

ఇంతలో వకుళ పళ్లెం నిండా ఎర్రనీళ్లు తీసుకువచ్చి, "అన్నయ్య! అందరం నీ గురించి చాలా బెంగ పెట్టేసుకున్నామురా! ముఖ్యంగా నాన్నగారు మరీను!" అంది తండ్రి కేసి చూస్తూ!

"చాల్లే! నువ్వెప్పుడు నాన్న కూతురివేలే!" పెద్దక్క వనజ నవ్వుతూ వకుళ తల మీద చిన్నగా మొట్టింది!

"అక్కా ఎలా ఉన్నావు!" రవితేజ పలకరించాడు! బాగానే ఉన్నానన్నట్టుగా తలూపింది వనజ!

"ముందా పళ్లెం ఇలా ఇవ్వండే మీరు!" కళకళ లాడిపోతున్న ముఖంలో లక్ష్మి దేవి కొడుక్కి దిష్టి తీసి అతన్ని లోపలికి తీసుకెళ్లింది!

లోపలికి వస్తుంటే, "ఏరా రవి, ఎలా ఉన్నావురా?" పెద బావ శ్రీధర్ చనువుగా పలకరించాడు భుజం మీద చేయివేసి! "చాలా మారిపోయావు రవి?" అంటూ చిన్న బావ శ్రీనివాస్ ఆశ్చర్యం ప్రకటించాడు! అందరిని చిరునవ్వుతో పలకరిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టాడు రవితేజ!!

కాని అతని కళ్లు పదే పదే తన మనస్సుకి కావాల్సిన వ్యక్తి కోసం గాలిస్తున్నాయి!! కాని తను ఎక్కడా కనపడలేదు!!!

"అన్నయ్యా, చాలా తెల్లపడ్డావు! అమెరికా నీళ్లు నీకు బాగా పడ్డాయిరా?" అంది వకుళ, కాఫీలు తాగాక!

అరడుగుల ఎత్తులో బలంగా, అందంగా ఉన్న కొడుకుని పదే పదే చూస్తూ మురిసిపోతున్న లక్ష్మీదేవి, "నీ ముఖం వకుళా, వాడసలే నల్లబడి చిక్కిపోతేను!" అంది ముద్దుగా కూతుర్ని విసుక్కుంటూ!

"అమ్మా! ఓ మాట చెప్పనా! ఏ తల్లికయినా పిల్లలు నాలుగు రోజులు తమ దగ్గర లేకపోతే వాళ్లు చాలా చిక్కిపోయినట్టే కనపడతారు!" అంటూ వకుళ వెటకారమాడింది!

"నిజమేనే వకుళా! నాలుగు రోజులకే ఏ తల్లికయినా అలాగే అనిపిస్తే మరి నా పిల్లాడు నా కంటికి కనపడక ఏన్నేళ్లయ్యింది చెప్పు?" "నీ పదేళ్ల కొడుకుని నా దగ్గర ఓ వారం రోజులు ఉంచవే అంటే, "అమ్మో, వారమే? అబ్బే కుదరదు, చదువులు పోవు" అంటూ ఏదో ఒక వంక పెట్టి నా మనవడిని నీతో లాక్కుపోతావు?" "మరి రవి వెళ్లి ఆరేళ్లు దాటింది? అందరిని వదిలి వెళ్లి వాడు అక్కడ అమెరికాలో ఎలా ఉన్నాడో, ఏం తింటున్నాడో, ఏం చేస్తున్నాడో అని క్షణ క్షణం వాడ్ని తలుచుకుంటూ, బాధపడుతూ ఇన్నాళ్లు నరకంలో ఉన్నట్టు గడిపాను, తల్లిగా నేను పడ్డ బాధ పగవాడికి కూడా వద్దు!" లక్ష్మీదేవి గద్గదికంగా అంది!

తల్లి ఆవేదనకు రవితేజ కళ్లలో నీళ్లు నిలిచాయి! "అమ్మా! బాధపడకమ్మా! నేను వచ్చేసానుగా! ఈ ప్రేమల్ని, అభిమానాల్ని వెతుక్కుంటూ అందుకే తిరిగి వెనక్కి వచ్చేసాను! ఇక నుంచి నువ్వెప్పుడు నవ్వుతూనే ఉండాలి! ఇక ఎప్పటికి మిమ్మల్ని వదిలి పెట్టి ఎక్కడికి వెళ్లేదే లేదు!" తల్లి భుజం చుట్టు చేయి వేసి అన్నాడు రవితేజ వణుకుతున్న గొంతుతో!

ఆ మాటలకి ఆవిడ కళ్లు ఆనందంతో మెరిసాయి! "నిజంగా వెళ్లవు కదూ" అంది! " "నిజం"గా నిజం" అన్నాడతను!

"నా చేతిలో చేయి వేసి చెప్పు రవి!" "ప్రామీస్ అమ్మా!" సరేనా!" నవ్వేసాడు రవితేజ!

"అమ్మా ఇక లేవండి, రవి నువ్వు స్నానం చేసిరా ముందు, ఏ వేళప్పుడు తిన్నావో? ఏమిటో?" తువ్వాలు అందిస్తూ అంది వనజ!

"డాక్టరు గారికి తిండితో పనేమి ఉంటుంది. సరిపడా మందులు వేసుకోవడమే అందులోనూ అమెరికా డాక్టరు కదా!" శ్రీధర్ అన్నాడు నవ్వుతూ, వేళాకోళమాడుతూ!

"ఇంకా ఆ.... మందు మానలేదా పెదబావ!" రహస్యంగా అన్నాడు రవితేజ ముందుకు వంగుతూ, అతని చెవి దగ్గరగా!

"అబ్బే.... అదేం లేదు!" తడపడ్డాడు అతను! లక్ష్మీ దేవి నెమ్మదిగా వంటింటి వైపుకి కదిలింది, వాళ్ల మాటలు విని తనలో తాను నవ్వుకుంటూ! వనజ కళ్ల ముందు గతం మెదిలి ఆమె పెదాలపై నవ్వు విరిసింది! అది గమనించిన రవితేజ పకపకా నవ్వాడు!

స్నానం చేసి దేముడు గూట్లో అగరబత్తీలు వెలిగిస్తున్న రవితేజను చూసి ఆశ్చర్యపోతూ, "అమెరికా వెళ్లినా, రవితేజ, నువ్వేం మారలేదురా!" అన్నాడు శ్రీధర్!

దేముడికి దండం పెట్టుకుని బయటికి వస్తూ చిన్నగా నవ్వేసాడు రవితేజ! కొడుకు కేసి గర్వంగా చూసాడు సత్యమూర్తి! భోజనాలప్పుడు రవితేజ దగ్గరగా కూర్చుని కొసరి కొసరి వడ్డించి కడుపునిండా తినిపించింది లక్ష్మీదేవి!

"అమ్మా! చాలు ఇక నేను తినలేను" అంటూ అతను ఎంత గొడవ చేసినా వినకుండా!

రవితేజ వద్దంటున్నా వినకుండా విస్తరంతా నింపేసి అతను తినే వరకు వదల్లేదు అక్కాచెల్లెళ్లు!

అందరి అభిమానాలకి, ఆప్యాయతలకు అతని మనస్సు చలించి పోయింది! "కోట్లు సంపాదించినా ఇలాంటి ప్రేమల్ని కొనలేను! ఇంతటి అపూర్వమైన అనుభవాన్ని పొందలేను! అందుకే ఈ ప్రేమల కోసమే అమెరికా నుంచి పరుగెత్తుకు వచ్చేసాను! అక్కడ చాలా డబ్బు ఉంది, ఎన్నో సౌకర్యాలు ఉన్నాయి, విలాసవంతమైన జీవితం ఉంది! కాని ఇవేవి నా మనస్సును నింపలేక పోయాయి. నాలోని వెల్తిని భర్తీ చేయలేకపోయాయి! నాకు తృప్తిని ఇవ్వలేక పోయాయి!" అనుకున్నాడతను మనస్సులో ఎమోషనల్‌గా!

H H H H

భోజనాలు కాగానే అందరు సావిట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే తను తెచ్చిన ఖరీదైన బహుమతులు అందరికి పేరు పేరునా చెప్పి ఇచ్చాడు! శ్రీధర్ అప్పుడే తనకోసం తెచ్చిన కెమెరా తెరిచేసి అందర్ని ఫోటోలు తీసాడు!

వకుళ తన కోసం తెచ్చిన డైమండు సెట్టు పెట్టుకుని మురిసిపోతూ, "చాలా బావుందిరా అన్నయ్యా!" "మరి తులసికేం తెచ్చావురా!" అంది!

రవితేజ చివ్వున తలెత్తి చూసాడు చెల్లెలికేసి! వాతావరణం హఠాత్తుగా గంభీరంగా మారింది! అందరు మౌనంగా ఉండిపోయారు!

"నాన్నగారు! తులసి ఎలా ఉంది? నేను వస్తానని తెలిసి కూడా ఎందుకు రాలేదు! ఇంకా మావయ్య వాళ్ల కోపాలు తగ్గలేదా? తన మనస్సును సంబాళించుకుంటూ అడిగాడు! సత్యమూర్తి ఏం జవాబు చెప్పాలా అన్నట్టు భార్య వంక చూసాడు! ఆవిడ ఏం మాట్లాడకుండా తల తిప్పుకుంది!

రవితేజ మళ్లీ ఏదో ఆత్రంగా అడగబోయేంతలో అతని చేతిలో సెల్ మోగింది!

"హలో!" అన్నాడతను! "హాయ్ ఆనంద్!" ఉత్సాహంగా అన్నాడు! "ఓరే!" ఓకే! చూద్దాం! సరే!" "కిరణ్ కబురు పట్టి కలుద్దాం!" ఐ యామ్ వెయిటింగ్ ఫర్ హిజ్ కాల్ ఈగర్లీ! "యా!" "తప్పకుండా! మనం అనుకున్నది ఎలాగైనా సాధించి తీరాలి!" పట్టుదల ధ్వనించింది రవితేజ గొంతులో! "ఒకే, బై" ఫోన్ పెట్టేసాడు.

"ఎవర్రా" లక్ష్మీదేవి అడిగింది! రవితేజ సమాధానం చెప్పేలోగా మళ్లీ సెల్ మోగింది! తల్లిని ఆగమన్నట్టుగా సైగ చేస్తూ! "హలో!" "ఆ చెప్పు కిరణ్!" అన్నాడు రవితేజ!

"ఓకే, ఎన్ని గంటలకు ఫిక్స్ చేసావు?" "సరే! అయితే ఈవాళే బయలుదేరాలిగా!"

"గుడ్, మంచి పని చేసావు! నేను రెడీనే!" యా!" ఓకే, బై!" మొబైల్ ఆఫ్ చేసాడు. ఎవ్వరికి ఏమి అర్థం కావడం లేదు! అతని ముఖంలో మటుకు కోటి కాంతులు!!!!

వెలిగిపోతున్న ముఖంతో "నాన్నగారు, నేను రేపు ప్రొద్దున్న కల్లా హైదరాబాదులో ఉండాలి. నాకు సి.ఎం.తో అప్పాయింట్‌మెంట్ ఉంది!" అన్నాడు!

"ఛీఫ్ మినిస్టర్‌తోనా" సత్యమూర్తి ఆశ్చర్యపోతూ అన్నాడు! అందరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ఆనందంతో పొంగిపోతూ!

"రేపేనా, ఇప్పుడే వచ్చావు, మళ్లీ ఈవాళే వెళ్ళిపోతావా!" లక్ష్మీదేవి దిగులుగా అంది!

"అమ్మా, మళ్లీ వెంటనే వచ్చేస్తాగా! నేను అనుకున్న విధంగా పనులన్ని జరిగితే ఇక ఎన్నేళయినా నీ దగ్గరే,

ఇలాగే ఉండిపోతాను!" తల్లి రెండు చేతులు పట్టుకుని ఉత్సాహంగా ఊపుతూ అన్నాడతను!

లక్ష్మీదేవికి చిన్ననాడు తన చుట్టు తిరిగిన రవితేజ మళ్లీ కళ్లకు కనిపించినట్టనిపించింది. ఆనందంతో ఆవిడ మనస్సు నిండిపోగా, "రవి, నిన్ను వదిలి ఉండలేనురా! నువ్వెక్కడుంటే ఇక నేను నీతో వచ్చేసి అక్కడే ఉండిపోతాను! అంతే!" అంది చిన్న పిల్లల్లాగా!

"అబ్బా! అమ్మా, ఎంత చక్కగా చెబుతున్నావు, నాన్నని వదిలి నువ్వు అర క్షణం అయినా ఉండగలవా చెప్పు?" వకుళ నవ్వుతూ అంది.

"అందుకే అమ్మా! నువ్వు నా వెంట కాదు, నేనే నీ వెంట ఉండాలని, ఇక్కడే మీతో పాటే ఎప్పటికీ మీ నీడలోనే నేను ఉండాలని నన్ను ఆశీర్వదించు ముందు!" తల్లి రెండు చేతులు తల మీద పెట్టుకుంటూ ఎమోషనల్‌గా అన్నాడతను!

ఆశ్చర్యంగా కొడుకు వంక చూస్తూ "అలాగే" అంటూ అతని తల నిమిరింది లక్ష్మీదేవి!

"నాన్నగారు, నేనో పెద్ద ప్రాజెక్టు చేపట్టాను. దానికి కనుక ప్రభుత్వం ఒప్పుకుని సహకరిస్తే నా కలలన్నీ అన్నీ నిజమయినట్టే! నా సంకల్పం నేరవేరాలని నన్ను ఆశీర్వదించండి!" అంటూ చటుక్కున వంగి తండ్రి పాదాలకి నమస్కరించాడు.

సత్యమూర్తి ఆనందంగా కొడుకుని దగ్గరకి తీసుకుంటూ, "మా ఆశీర్వచనాలు ఎప్పుడు నీ వెంటేరా రవితేజ!" నీ సంకల్పం తప్పక నెరవేరుతుంది! నువ్వు తప్పకుండా విజయం సాధిస్తావు!" అంటూ అతన్ని దగ్గరగా హత్తుకున్నారు! ఓ క్షణం పాటు అందరు ఉద్విగులై పోయారు ఆ దృశ్యాల్ని చూసి!

"బెస్టాఫ్ లక్" రవితేజ!" బావగారు ముందుకు వచ్చి అభినందనలు తెలిపారు!

"థ్యాంక్స్!" అంటూ "నేను వెంటనే బయలుదేరాలి!" అన్నాడతను, తన గదిలోకి వెళ్లి ల్యాప్‌టాప్ ఒపెన్ చేస్తూ!

"నాన్నగారు! "అన్నయ్యా, తులసిని పూర్తిగా మర్చిపోయినట్టే ఉన్నాడు!" వకుళ అంది వెళుతున్న రవితేజని వెనకగా చూస్తూ!

"ఛ! వాడు అలాంటి వాడు కాదు వకుళా! ఏన్నేళ్లయినా, వాడు ఎప్పటికి మారిపోయే మనిషే కాదు!" విశ్వాసంగా అన్నాడు సత్యమూర్తి!

"వాడు చిన్నప్పట్నుంచి ఒకటే పద్ధతి! వాడు మాటంటే మాటే!" "తులసిని దేవతలా తన మనస్సులోనే ప్రతిష్టించుకున్నాడు! "అంతకన్నా విలువైన కానుక ఏ ఆడపిల్లకయినా ఇంకేం ఏముంటుంది?" గర్వంగా అంది లక్ష్మీదేవి".

"ఏమో అత్తయ్యగారు? నాకయితే అంత విషయం ఉన్నట్టు ఏమీ అనిపించడం లేదు!" తేలిగ్గా తీసిపడేస్తూ అన్నాడు శ్రీనివాస్!

లోపల రెడీ అవుతున్న రవితేజకి, వాళ్ల మాటలు లీలగా వినపడుతున్నాయి! అయినా అప్పటికే అతని మనస్సు ఎక్కడో చిక్కుపడి విడదీసుకుని రాలేక సతమతమవుతోంది! "ఎక్కడ? ఎక్కడ?" పదే పదే అదురుతున్న హృదయాన్ని ప్రశ్నించుకున్నాడతను! "అవును! తులసి!" తన దగ్గరే మనస్సు చిక్కుపడి పోయింది!

అందమైన తులసి రూపం కళ్ల ముందు మెరిసి గతాన్ని అతన్ని ముందు నిలిపింది.

H H H H

"అమ్మా! ఇప్పుడే వస్తాను!" బైక్ స్టార్టు చేస్తూ హడావుడిగా అన్నాడు రవితేజ!

"అరే, ఇప్పుడే కదా వచ్చింది, అప్పుడే ఎక్కడికిరా? ఉండు!" కాస్త టిఫిను తిని వెళ్తువుగాని!" లక్ష్మీదేవి అంది!

"అబ్బా, క్షణంలో వచ్చేస్తానుగా! మావయ్య ఇంటి దాకా వెళ్లి వస్తాను!" అంటూ బైక్ ముందుకు దూకించాడు! విషయం అర్థమై, నవ్వుకుంటూ ఆవిడ లోపలికి వెళ్లింది!

"లక్ష్మీదేవి, వీడిప్పుడేగా కాకినాడ నుంచి వచ్చింది? మళ్లీ ఎక్కడికి వెళ్తున్నాడు?" అప్పుడే పొలం నుంచి వచ్చిన సత్యమూర్తి కాళ్లు కడుక్కుని లోపలికి వస్తూ అడిగాడు భార్యని ఆశ్చర్యంగా!

"ఇంకెక్కడికి! మా అన్నయ్య ఇంటికే! రెండో సంవత్సరం పరీక్షలు అయ్యాయిగా, నిన్నట్నుంచి సెలవులు వాడికి? ఇక కాళ్లు ఆగడం లేదు! నెల దాటి పోయిందిగా తులసిని చూసి, అందుకే ఆ హడావుడి!" ముసి ముసి నవ్వులతో అంది లక్ష్మిదేవి!

"ఆ, ఆదా సంగతి! చూస్తుంటే మూడు ముళ్లు వేయించేస్తే గాని వీడి జోరు ఆగేటట్టు లేదు?" నవ్వుతూ అన్నాడు సత్యమూర్తి! "ఇంకా మెడిసిన్ పూర్తి కాకుండానే!" అంది తువ్వాలు ఆయనకి అందిస్తూ!

"అయినా అటు అక్కడ వాడి మెడిసిన్ సంగతేమో కాని ఇక్కడ తులసికి ఇంటర్ దాటడం మటుకు కొంచెం కష్టంగానే వుంది!" వకుళ అంది తండ్రికి మంచి నీళ్లు అందిస్తూ!

"పోన్లేవే వకుళా, దాని చదువుకేం కాని!" "ఏవండి, అసలు వాడి జోరు కన్నా తులసి ఆత్రానికేం తక్కువ లేదు, పాపం నిన్నంతా అన్నమే తినలేదు. "పరీక్ష కాగానే బావ వచ్చేస్తాడు, అతనితోనే తింటాను" అంటూ నిన్నంతా ఏమి తినకుండా పూర్తిగా పస్తూ ఉంది! నేను ఆ మాట వాడితో ఇలా అన్నానో లేదో ఇక క్షణం ఆగలేదు వాడు!"

"నిజమేనే లక్ష్మి! వాడంటేనే తులసికి పంచ ప్రాణాలు! దేముడు ఇద్దరిది మంచి జోడే కుదిర్చాడు!" అంటూ లోపలికి నడిచారాయన!

H H H H

"అత్తయ్యా! తులసేది!" రవితేజ అడిగాడు పద్మావతిని "అరే, ఇక్కడే ఉండాలిగా! తోటలోకి గాని వెళ్లిందేమో!" క్షణం కాలు నిలవదు దానికి ఇంట్లో!" అంది పద్మావతి!

"నే చూస్తానులే అత్తయ్య! అన్నాడతను. "పరీక్షలు బాగా వ్రాసావా?" అడిగిందామె!

"ఆ, చాలా బాగా వ్రాసాను" మావయ్య, పొలానికి వెళ్లాడా!" అంటూ ఇంటి వెనుక తోటలోకి నడిచాడతను!

"తులసి!" రవితేజ తోటలో కలియతిరుగుతూ పిలిచాడు! "బావ! ఇక్కడ?" తులసి గొంతు విని తల తిప్పాడు!

ఆకుపచ్చని పట్టులంగా, తెల్లని ఓణి వేసుకొని తల నిండా జాజిపూలతో వనరాణిలా తులసి ఎదురుగా కనిపించింది! "ఏయ్" తులసి! ఇక్కడేం చేస్తున్నావ్!" వెలిగిపోతున్న ముఖంతో అన్నాడు!

అతన్ని చూడగానే ఆమె ముఖంలో ఆనందం తళుక్కుమని మెరిసింది!

"అయినా ఏమిటీ వేషం!" అన్నాడు నవ్వుతూ. "ఏం బాగోలేనా?" బుంగమూతి పెడుతూ అడిగింది!

"బాపు బొమ్మలా ఉన్నావు?" బుగ్గ మీద చిటికేస్తూ అన్నాడు.

"థ్యాంక్స్ కాని, నువ్వు ఇప్పుడా రావడం చెప్పు?" అలకగా అంది.

"ఏం చెయ్యను? అయినా మొద్దు నిన్నంతా అన్నం తిన్నలేదట? ఎందుకీ పిచ్చి పనులు చెప్పు?" చెవి పట్టుకుని అడిగాడు, "అబ్బా, ఎవరు చెప్పారు నీకు!" అతన్నుంచి విడిపించుకుంటూ అంది!

"ఎవరు చెబితేనేం కానీ! నీకు ముందే చెప్పానుగా, ఎప్పుడూ అలా తిండి మానొద్దని!" తెచ్చి పెట్టుకున్న కోపంతో అన్నాడు! "మరి నిన్న పరీక్ష అయితే ఇవాళ రావడం, చెప్పు?" మళ్లీ గుర్తుకు వచ్చినట్టుగా అడిగింది!

"నాకు మాత్రం వెంటనే వచ్చేయాలని ఉండదు, అయినా ఫ్రెండ్స్ అందరు గొడవ పెడితే ఇక తప్పలేదు! నిన్నంతా పార్టీ, సెలబ్రెషన్స్ అబ్బా చాలా హడావుడి చేసార్లే అందరూ!" అందుకే ఉండిపోవాల్సి వచ్చింది!"

"అందుకే, నన్ను మర్చిపోయావు!" తల తిప్పుకుంటూ అంది! తనని రెండు చేతులలో చుట్టేస్తూ, కళ్లలోకి తనివి తీరా చూస్తూ. "నిన్నెక్కడ మర్చిపోతాను తులసి, నా శ్వాస నిశ్వాసలో అంతా నువ్వే ఉంటే!" కళ్ల నిండా ప్రేమ కదలాడుతుండగా అన్నాడు "బావా!" అంటూ ఇక ఆగలేనట్టుగా అతన్ని హత్తుకుపోయింది గట్టిగా!

H H H H

"అమ్మా!" రేపు వనజక్క వాళ్లింటికి వెళదామా!" రవితేజ అడిగాడు తల్లిని!

అతని మాటలు వింటూనే లక్ష్మీదేవి కళ్లలో నీలినీడలు కదిలాయి! దీర్ఘంగా నిట్టూర్చి వేలితో జారుముడిని సవరించుకుంటూ లోపలికి నడిచింది!

"ఏమ్మా!" మాట్లాడవేం? అదేమిటి అలా అయిపోయావు?" విషయం ఏమిటో అర్థం కాక అడిగాడతను! టిఫిను పెట్టడానికి ప్లేట్లు సర్దుతూ.

"చెప్పడానికేముందిరా! వనజకి, శ్రీధర్‌కి అస్సలు పొడగడం లేదు!" ఒకరు నిప్పు అయితే మరొకరు ఉప్పు! ఇంకా వాళ్ల సంసారం సవ్యంగా ఎలా నడుస్తుంది చెప్పు!" బాధగా అంది!

"అదేమిటమ్మా! ఇంకా పెళ్లయి ఏడాది కూడా కాలేదు! అప్పుడే గొడవలా! అయినా బావ చాలా సరదాగానే ఉంటాడే!" ఆదుర్దాగా అన్నాడతను!

"ఆ సరదాయే అన్ని గొడవలకి కారణం!" సత్యమూర్తి పూజ ముగించి బట్టలు వేసుకుంటూ అన్నాడు! తికమకగా చూసాడతను తండ్రి వంక!

"నీకింకా అర్థం కాదులే!" ముక్తసరిగా అంది లక్ష్మిదేవి!

"అర్థం కాకపోవడానికి వాడేమన్నా పసికూనా ఏమిటి? రవి, శ్రీధర్‌కి అన్ని మంచి గుణాలే ఉన్నాయి. కాని తాగుడు వల్ల?" సత్యమూర్తి ఆవేదనగా అన్నాడు.

"తాగుడా!" బావ తాగుతాడా!" ఆశ్చర్యపోతూ అన్నాడు రవితేజ నమ్మలేనట్టుగా!

"అదొక్క దుర్గణం చాలదు? అతని తాగుడు వల్లే కదా సంసారం గుల్ల అయ్యి పోతున్నది!" కోపంగా అంది లక్ష్మిదేవి!

"లక్ష్మి! ఊరికే ఎందుకు ఆవేశపడతావు?" అదిగో, ఇదే పోలిక వనజకి వచ్చింది! ఏదన్నా సమస్య వచ్చినప్పుడే భావోద్వేగాలకు లోనవకుండా ఏ మనిషైనా పరిష్కారానికి మార్గం ఏమిటా అని ఆలోచించాలి! అంతే కాని, "సమస్య వచ్చింది, నాకే వచ్చింది, నా జీవితం అంతా పాడైపోయింది!" అంటూ గొల్లుగొల్లుమని ఏడ్చేసి రాద్ధాంతాలు చేస్తే ఏమిటీ లాభం నువ్వే చెప్పు?" అయినా శ్రీధర్ మరీ అంత చెడ్డవాడేం కాదు కూడా!" కొంచెం తీవ్రంగానే అన్నాడు సత్యమూర్తి!

ఎన్నడు కోపంగా మాట్లాడని తండ్రి రూపాన్ని తొలిసారిగా ఆశ్చర్యంగా చూస్తుండి పోయాడు. "భర్త సరిగా లేకపోతే సంసారం ఎంత నరకమో మీకేం తెలుస్తుంది? అది పడే బాధ మీకేం అర్థం అవుతుందిలెండి?" అంది లక్ష్మిదేవి! కన్నీళ్లు ఉబికాయి ఆవిడ కళ్లలో కొద్దిగా!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Lakshyam+K+Vasavadatta+Ramana**

* * *